సాక్షి
ఏలూరు

శనివారం । 6 । ఏప్రిల్ । 2024




వలంటీర్ల రాజీనామా

నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తాము ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలు బలై రాజీనామాలు చేస్తున్నట్టు వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. IIలో ▸



నమాజులో ఆరోగ్య సూత్రాలు

ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆచరించే నమాజులో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయని పెద్దలు చెబుతున్నారు. IIలో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహరి ఆదివారం (ఉదయం)
ఏలూరు	6.27	4.32
భీమవరం	6.24	4.34

కూటమిలో కుమ్ములాటలు

పొసగని 'పొత్తు'

- ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు చుక్కలు
- అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న మాజీ ఎంపీ మాగంటి బాబు
- సోషల్ మీడియాలో మాగంటి బాబు పోస్టు వైరల్
- సహకరించేది లేదంటూ తేల్చిచెప్పిన బీజేపీ శ్రేణులు
- ఏలూరు నుంచి పోటీ చేసేది తానేనంటున్న బీజేపీ నేత తపన చౌదరి
- అభ్యర్థిని మారుస్తారంటూ టీడీపీ, బీజేపీలో విస్తృత ప్రచారం
- గందరగోళంలో ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమిలో కుమ్ములాటలు ఒకవైపు.. దిగుమతి నేత మాకొద్దు మీ దారి మీరు చూసుకోండి అనంటూ సొంత పార్టీ నేతలు సోషల్ మీడియా వేదికగా బహిరంగంగా చెబుతుండటం.. ఇక కూటమిలో కీలకమైన కమలం నేతలు ఎట్టి పరిస్థితుల్లో సహకరించబోమని, టికెట్ తమదేనని తేల్చి చెబుతుండటం.. ఏలూరు ఎంపీ స్థానంలో తానే పోటీ చేస్తానని బీజేపీ నేత తపన చౌదరి ప్రకటించడం.. అభ్యర్థిని ప్రకటించినా ఆశావహులు పట్టించుకోకపోవడం.. ఇదంతా ఏలూరు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్ ఎదుర్కొంటున్న పరిస్థితి.

ఇక ఏలూరు ఎంపీ సీటు టీడీపీకి కేటాయించడం, అందులో నాన్ లోకల్ అభ్యర్థికి ఇవ్వడంతో బీజేపీలో తీవ్ర రగడ కొనసాగుతోంది. బీజేపీ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ బీజేపీ అధిష్టానంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నుంచి వచ్చి బీజేపీలో చేరిన నేతలకే పట్టం కట్టారు.. నాలుగు న్నరేళ్లుగా పార్టీని నమ్ముకొని పనిచేసిన గారపాటి చౌదరికి ఎందుకు సీటివ్వరు.. బీజేపీ శ్రేణులు ఎవరూ పార్లమెంట్‌లో టీడీపీ కోసం పనిచేయరు.. పార్టీ నేతల మనోభావాలకు విలువ ఇవ్వ

సహకరించని కమలదళం

నప్పుడు ఎందుకు పనిచేయాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇక టికెట్ ఆశించి భంగపడిన తపన చౌదరి కూటమి ఎంపీ అభ్యర్థిగా మహేష్ యాదవ్‌ను ప్రకటించిన తర్వాత పూర్తిగా కూటమికి దూరంగా ఉండటంతో పాటు టికెట్ తనకే వస్తుందని, బరిలో తానే ఉంటానని, అవసరమైతే ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేస్తానని ప్రకటించడంతో పాటు బీజేపీ కేడర్ మొత్తం టీడీపీ అభ్యర్థి ప్రచారానికి దూరంగా ఉంటుందని ప్రకటించారు. దీంతో అటు బీజేపీ సహకారం, ఇటు టీడీపీ సీనియర్ నేతల సహకారం లేకపోవడం, ఇక ఉన్న జనసేన నేతలు కనీసం ఉపయోగపడకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని అయోమయంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి పరిస్థితి ఉంది. ఈ పరిణామాల క్రమంలో టికెట్ మార్పు అనివార్యమంటూ మాగంటి బాబు వర్గం, బీజేపీ నేత తపనచౌదరి వర్గం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో అలజడి కొనసాగుతోంది.

రాయలసీమ నుంచి ఏలూరుకు వచ్చి కొత్తగా రాజకీయం చేయాల్సిన పనేమీ లేదని, తమ జిల్లా రాజకీయం వేరు... తాము చేసుకుంటామని కుండబద్దలు కొట్టినట్టు టీడీపీ నేతలు చెబుతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తన అభ్యర్థిత్వాన్ని పార్టీ ప్రకటించడంతో ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వారం రోజుల నుంచి తిరుగుతున్నా పట్టించుకునేవారు లేకపోవడం, మరోవైపు ఎంపీ అభ్యర్థిని మారుస్తారంటూ టీడీపీ, బీజేపీలో విస్తృత ప్రచారం జరుగుతుండటంతో పుట్టా మహేష్ భవితవ్యంపై నీలినీడలు అలముకున్నాయి.

పట్టించుకోని సొంత పార్టీ, కూటమి నేతలు

ఏలూరు లోక్‌సభ స్థానంలో కూటమి పార్టీల రగడ తారాస్థాయిలో కొనసాగుతోంది. బీజేపీ, జనసేన నేతల సహకారం లేకపోవడం, టీడీపీలోని సీనియర్ నేతలు పట్టించుకోకపోవడం, బహిరంగంగా విమర్శలు కూడా చేయడంతో ఎంపీ అభ్యర్థి పరిస్థితి రోజూ బుజ్జగింపులు, సర్దుబాట్లతోనే సాగుతోంది. ఇంతా చేసి బుజ్జగించి, రకరకాలుగా సర్దుబాటు చేసినా వర్కవుట్ కాని పరిస్థితి ఏర్పడింది. పది రోజుల క్రితం మహేష్ యాదవ్‌ను అభ్యర్థిగా టీడీపీ ప్రకటించిన తర్వాత భారీ ర్యాలీతో జిల్లాలో హడావుడి చేయాలని ప్లాన్ చేసినా.. ఇన్‌చార్జులు పూర్తిగా కలిసిరాకపోవడంతో అది వర్కవుట్ కాలేదు. కైకలూరు, నూజివీడు టీడీపీ నేతలు, పోలవరం టీడీపీ, జనసేన నేతలు మహేష్ యాదవ్ పరిచయ సభకు దూరంగా ఉన్నారు. ఇక ఏలూరు ఎంపీ సీటు ఆశించిన టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మాగంటి బాబు అయితే.. మహేష్ యాదవ్ అభ్యర్థిత్వం ఖరారైనప్పటి నుంచి ఇప్పటివరకు టీడీపీ కార్యాలయం వైపు తొంగిచూడని పరిస్థితి. ఇప్పటికే ఆయన తీవ్రస్థాయిలో అసంతృప్తిని వ్యక్తం చేయడం, ఆయన వర్గం నేతలు చంద్రబాబుకి వరుస లేఖలు రాయడంతో మూడు రోజుల క్రితం మాగంటి బాబు దంపతులు చంద్రబాబుతో భేటీ అయ్యారు. అయితే.. చర్చలు అసంతృప్తిగా ముగిశాయి. మళ్లీ భేటీ ఉంటుందని, మళ్లీ మంచి విషయం వింటారని కేడర్‌కు చెప్పడంతో పాటు సోషల్ మీడియాలో మాగంటి బాబు పోస్టు చేయడం టీడీపీలో కలకలం రేపింది.

సోషల్ మీడియాలో మాగంటి బాబు పోస్ట్ ఇదే..

'పార్లమెంట్ సీటు ఎందుకు మార్చారు.. మనల్ని అడగకుండా, సంప్రదించకుండా మార్చడం మనల్ని అవమానించడమే కదా.. ఇదే విషయాన్ని చంద్రబాబునాయుడుతో గట్టిగా మాట్లాడటం జరిగింది.. బీసీ అనే మాట ఎందుకు ప్రచారంలోకి తెచ్చారు.. ఏలూరు పార్లమెంట్ సీటు కావాలని ఎవరైనా బీసీలు అడిగారా.. ఇది కేవలం మాకు పొగపెట్టడమే.. జిల్లాకు ముఖ పరిచయం, రాజకీయ అనుభవం లేని వ్యక్తిని పార్లమెంట్ నుంచి ఎలా నిలబెడతారు.. బీసీ వర్గానికే ఇవ్వాలి అనుకుంటే యనమల కుటుంబం తప్ప మిగిలినవారు కనపడలేదా.. యనమల కుటుంబంలోనే నాలుగు సీట్లు ఇస్తే బీసీలు అంగీకరిస్తారా.. మాటైనా చెప్పకుండా ఇదంతా చేయడమేమిటి.. ఇలా అన్ని అంశాలు చంద్రబాబుకు వివరిస్తే చేద్దాం చూద్దాం అని సమాధానమిచ్చారు.. సీటు మార్చడం కుదరదు.. మీకు రాజ్యసభ ఇస్తామని, బహిరంగ సభలో ప్రకటిస్తామని చెప్పారు.. మా కుటుంబం ఎప్పుడూ పరోక్ష ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించలేదు.. జనంలోనే ఉండాలి.. జనమే బలమని, సీటు ఇవ్వాలని కోరాం.. రెండు రోజుల్లో దీనిపై స్పష్టత నిర్ణయం వస్తుంది.. అంతా మంచే జరుగుతుంది..' అంటూ మాగంటి బాబు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇక మాగంటి బాబు కుటుంబానికి జిల్లాలో సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన తండ్రి మాగంటి రవీంద్రనాథ్ చౌదరి, తల్లి మాగంటి వరలక్ష్మి ఎమ్మెల్యేలు, మంత్రులుగా చేశారు. ఇక మాగంటి బాబు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేయడంతో పాటు ఉప ఎన్నికలతో కలిపి ఆరుసార్లు ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి 1998లో ఒకసారి, 2009 నుంచి 2019 వరకు టీడీపీ అభ్యర్థిగా మూడుసార్లు పోటీ చేసి 2014లో ఒకసారి గెలుపొందారు.

న్యూస్‌రీల్

గుబ్బల మంగమ్మ సన్నిధిలో కలెక్టర్



గుబ్బల మంగమ్మ తల్లి సన్నిధిలో కలెక్టర్ దంపతులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గిరిజనుల ఆరాధ్య దేవత గుబ్బల మంగమ్మవారిని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, మానస దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారి విశిష్టతను యూట్యూబ్‌లో చూసి తెలుసుకున్నానని, స్వయంగా వచ్చి చూస్తే ఇక్కడ ప్రకృతి రమణీయత చాలా ఆహ్లాదంగా ఉందన్నారు. ఆలయ విశిష్టతను కమిటీ సభ్యులు కోర్సా రాంబాబు, కె.గంగరాజు, ఇక్బాల్ ఆయనకు వివరించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ లక్ష్మి కలెక్టర్ వెంట ఉన్నారు.

కొనసాగిన జేఈఈ మెయిన్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ స్థాయి విద్యా సంస్థలు నిట్, ట్రిపుల్‌ఐటీ కళాశాలల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయిన్ రెండో విడత పరీక్షలు శుక్రవారం కొనసాగాయి. జిల్లాలో 530 మందికి 484 మంది హాజరయ్యారు. స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మందికి 167 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 72 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 172 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్‌లో 85 మందికి గాను 73 మంది హాజరయ్యారు. పరీక్షలను కో–ఆర్డినేటర్ పి.సాయి కుమారి శంకర్ పర్యవేక్షించారు.

కవి ఎంఆర్‌వీకి పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఎంఆర్‌వీ మూర్తి

పెనుగొండ: పెనుగొండకు చెందిన కవి, కథా, నాటక రచయిత ఎంఆర్‌వీ సత్యనారాయణమూర్తి స్వాతంత్ర్య సమరయోధుడు పడాల రామారావు స్మారక అవార్డు అందుకున్నారు. శుక్రవారం ఎంఆర్‌వీ పెనుగొండలో విలేకరులతో మాట్లాడుతూ గురువారం రాజమండ్రి ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా అభ్యుదయ రచయితల సంఘం సభలో సంఘ గౌరవ అధ్యక్షుడు రామారెడ్డి అవార్డు అందజేశారన్నారు. అరసం రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్, ఆదిత్య సంస్థల డైరెక్టర్ పి.గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారన్నారు. ఎంవీఆర్‌ను స్థానిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు, త్యాగరాజు గానసభ అధ్యక్షురాలు కె.అన్నపూర్ణ అభినందించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

భీమవరం(ప్రకాశంచౌక్): ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావడంతో పాటు ఓటు హక్కు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు హాజరైన వసతి గృహాల ఇంజనీరింగ్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వారి చదువు, వయసు వివరాలు తెలుసుకుని ఓటు ఎక్కడ ఉందని ఆరా తీశారు. 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని హితవు పలికారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు, ఓటర్ హెల్ప్‌లైన్‌పై వివరించారు. ఈనెల 14 వరకు ఓటు నమోదుకు గడువు ఉందన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా వీఓటీఈఆర్ఎస్. ఈసీఐ.జీఓవీ.ఇన్. లేదా సీఈఓఏపీఎస్ డీహెచ్ఆర్‌ఏ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

అంబులెన్స్‌లకు అధిక చార్జీలు సహించం

భీమవరం(ప్రకారం చౌక్): జిల్లాలోని అంబులెన్స్ యజమానులు నిర్దేశిత చార్జీలకు మించి వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని అంబులెన్స్ యజమానులు ఇష్టానుసారంగా చార్జీలు వసూలు చేస్తున్నట్టు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై జిల్లా రవాణా అధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కిలోమీటర్ల వారీగా చార్జీల పట్టికను విడుదల చేశామన్నారు. ఇంతకు మించి వసూలు చేస్తే ఊరుకోబోమన్నారు. చార్జీల పట్టిక ప్రతి వాహనంలో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద 300 మీటర్ల దూరంలో అంబులెన్స్‌లో పెట్టుకోవచ్చని, మానిటరింగ్ సెల్ ఏర్పాటుచేశామన్నారు. నిబంధనలు మీరితే 85008 14033, 93904 11784, 91542 94686కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్



జగ్జీవన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించిన భారత జాతి గర్వించదగిన మహనీయులు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏలూరు కో–ఆప్షన్ సభ్యుడు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలోని బలహీనవర్గాలు, బడుగుల జీవితాల్లో జగ్జీవన్ వెలుగులు నింపారన్నారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఇడా చైర్మన్, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, క్లస్టర్–3 పార్టీ అధ్యక్షుడు మంచెం మైబాబు, కార్పొరేటర్లు, దళిత నాయకులు పాల్గొన్నారు.

మరోమారు సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

- ఏలూరులో కోలాహలంగా ఎన్నికల ప్రచారం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని అభ్యర్థన



ఏలూరులో ఎన్నికల ప్రచారంలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన అందించారని, మరోసారి ప్రజలంతా ఆశీర్వదించాలని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని కోరారు. ఏలూరులోని 47వ డివిజన్‌లో రెండో రోజు ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ఆయన చేపట్టారు. ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఏలూరు కో–ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ ఆధ్వర్యంలో ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాని ఇజ్రాయేల్‌పేట, బాలయోగి వంతెన రోడ్డు, రాణినగర్, తిలక్‌నగర్, పాత మసీదు ముస్లిం ప్రాంతంలో ప్రతీ ఇంటికీ వెళుతూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

ఇంటింటికీ వెళుతూ..

ఎమ్మెల్యే నాని ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్‌సీపీ నేతలు, పార్టీ కేడర్‌తో పాటు, అభిమానులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతి ఇంటికీ వెళుతూ సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యే నాని ముందుకు కదిలారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు 58 నెలల కాలంలో రూ.447 కోట్ల మేర సంక్షేమ పథకాల రూపంలో సొమ్ములు అందించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా పథకాలు అందించామని గుర్తుచేశారు. ఏలూరు నగరంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నాని చెప్పారు.

నేడు ముద్రగడ తణుకు రాక

తణుకు అర్బన్: తణుకులో శనివారం నిర్వహించనున్న ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం హాజరుకానున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు తణుకు జాతీయ రహదారి సమీపంలోని కమ్మ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. కాపు సోదరులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ముద్రగడ అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

బాబు కుట్రలకు చెంపపెట్టు

- సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 95.22 శాతం పూర్తి
- నడవలేని వారి ఇళ్లకే వెళ్లి అందజేత





ఏలూరులో ఇంటికే వెళ్లి పింఛన్ అందించేందుకు బయోమెట్రిక్ తీసుకుంటున్న సచివాలయ సిబ్బంది

ఏలూరు (మెట్రో): ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా.. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజల పక్షాన నిలబడింది.. పండుటాకులను ఇబ్బంది పెట్టేలా ప్రతిపక్షాలు కుట్రలు పన్నినా.. వాటిని ప్రభుత్వం దీటుగా ఎదుర్కొంది.. సామాజిక పింఛన్ లబ్ధిదారులకు పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంది.. వలంటీర్లను ఇంటికే వెళ్లి పింఛన్ ఇవ్వకుండా కుతంత్రాలకు పాల్పడిన ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా సచివాలయ వ్యవస్థ ద్వారా పెన్షన్‌దారుల ఇళ్ల వద్దకు, సచివాలయాల వద్ద పెన్షన్లు పంపిణీ పక్కాగా చేయించింది. దీంతో జిల్లావ్యాప్తంగా మూడు రోజుల్లో 95.22 శాతం పింఛన్ పంపిణీ పూర్తయ్యింది.

ప్రత్యేక దృష్టితో..

వలంటీర్ల ద్వారా ఇంటికే పింఛన్ల పంపిణీని అడ్డుకునేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీలు కుట్రలు పన్నాయి. వీటిని గుర్తించిన ప్రభుత్వం పెన్షన్‌దారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది. ఈనెల 3వ తేదీన పెన్షన్ల నగదును ఆయా సచివాలయాలకు జమ చేయించి తక్షణమే జిల్లా అధికారుల సమన్వయంతో సచివాలయ సిబ్బంది, బ్యాంకర్లు కలిసి పెన్షన్లను పక్కాగా పంపిణీ చేయించేలా చర్యలు తీసుకుంది. జిల్లా యంత్రాంగం మూడు రోజులపాటు పెన్షన్ల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించి వృద్ధులు, దివ్యాంగులు, మంచంపై లేవలేని పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి నేరుగా వారి ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు అందించే ఏర్పాట్లు చేసింది.

సచివాలయాల వద్ద ఏర్పాట్లు : పింఛన్ లబ్ధిదారులను సచివాలయాలకు రప్పించి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది. సచివాలయాల వద్ద షామియానాలు, కుర్చీలు, తాగునీటి కి ఏర్పాట్లు చేసింది. జిల్లావ్యాప్తంగా 2,70,804 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటివరకు 2,57,869 మందికి పింఛన్ల సొమ్ములు పంపిణీ చేసింది. మొదటి రోజు 48 శాతం, రెండో రోజు 87.76 శాతం, మూడో రోజు 95.20 శాతం పంపిణీ పూర్తి చేసింది. ప్రతిపక్షాలు పెన్షన్‌ను అడ్డుకునేందుకు కుట్రలు పన్నినా ప్రభుత్వం సమర్థంగా అందజేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెబుతాం



అధికార దాహంతో చంద్రబాబు వృద్ధులకు అందే పింఛన్లను అడ్డుకున్నాడు. వలంటీర్లపై విషం కక్కుతూ మాలాంటి వారిపై కక్ష తీర్చుకునేందుకు తన అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించాడు. దీంతో మేమంతా చాలా ఇబ్బంది పడ్డాం. చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం

– తిమ్మరాజు సత్యనారాయణ, కివ్వాక, కుక్కునూరు మండలం

బాబు చర్యలు దారుణం



గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ ఇవ్వడానికి చాలా ఇబ్బందులు పెట్టాడు. ఇప్పుడు ఇంకా ఎన్నికల్లో గెలవకముందే మమ్మల్ని ఇంత ఇబ్బంది పెడితే మాలాంటి లేవలేని వాళ్ల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. పింఛన్లను తన ప్రయోజనాల కోసం చంద్రబాబు అడ్డుకున్నాడు. ఇంత చాలా దారుణం.

– కాకాని వెంకటేశ్వరరావు, కివ్వాక, కుక్కునూరు మండలం

సువిధ ద్వారా 583 అనుమతులు మంజూరు

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ /ఎన్‌కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇప్పటివరకు 583 అనుమతులు ఇచ్చామని శుక్రవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించమన్నారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా గురువారం రాత్రి వరకు 862 అభ్యర్థనలు రాగా 583 అనుమతులు జారీ చేయగా మరో 8 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయని 271 తిరస్కరించామన్నారు. సీ–విజిల్ ద్వారా 259 ఫిర్యాదులు అందగా వాటిలో 162 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మరో 97 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించామన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 79 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెసేజ్/ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలకు అధికార యంత్రాంగానికి అందించాలని కోరారు. దీనికి వాట్సాప్ నంబర్ 9491041435 అందుబాటులో ఉంచామని, ప్రజలు వినియోగించుకుని ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో కాల్‌సెంటర్‌ను 1800 233 1077 నంబర్‌తో ఏర్పాటుచేశామన్నారు.

కిరాణా వ్యాపారులతోనే చంద్రబాబు పతనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కిరాణా వ్యాపారులతోనే చంద్రబాబు పతనం ప్రారంభం కానుందని వైఎస్సార్‌సీపీ వాణిజ్య సెల్ జిల్లా అధ్యక్షుడు చలువాది బాలకృష్ణ, నగర అధ్యక్షుడు బుర్రంశెట్టి బ్రహ్మయ్య ప్రకటనలో స్పష్టం చేశారు. రావులపాలెం పర్యటనలో భాగంగా కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారని అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వారు ఖండించారు. ఆర్యవైశ్యులంటే చంద్రబాబుకి ఆది నుంచీ చులకన భావమేనన్నారు. అసెంబ్లీలో రోశయ్య చంద్రబాబుని అనేక సందర్భాల్లో నిలదీయడంతో సమాధానం చెప్పలేక యావత్తు ఆర్యవైశ్యులపై చంద్రబాబు వ్యతిరేకతను పెంచుకున్నారన్నారు. చంద్రబాబుకి దమ్ము ఉంటే తన వ్యాఖ్యలను నిరూపించుకోవాలని, ఎన్ని కిరాణా దుకాణాల్లో గంజాయి విక్రయిస్తున్నారో రుజువులు చూపాలని డిమాండ్ చేశారు. కిరాణా వ్యాపారుల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబు వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రోడ్లెక్కి చంద్రబాబును రాజకీయంగా అణగదొక్కడానికి కంకణం కట్టుకుంటారని హెచ్చరించారు. ఒక్కొక్క కిరాణా వ్యాపారి వంద మందితో సమానమని, తన వద్దకు వచ్చే ప్రతి వినియోగదారుడికీ చంద్రబాబు నీచత్వాన్ని చెప్పి అతని పతనాన్ని శాసిస్తారని వారు హెచ్చరించారు.

క్లుప్తంగా

గోతిలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు



జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి సమీపంలో రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లిన బస్సు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి సమీపంలో జంగారెడ్డిగూడెంకు చెందిన స్కూల్ బస్సు శుక్రవారం రోడ్డు మార్జిన్ గోతిలోకి దూసుకెళ్లింది. బస్సులో 15 మంది విద్యార్థులున్నప్పటికీ విద్యార్థులకు ఏమీ కాకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

నగదు స్వాధీనం



గణపవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సుభాష్, తనిఖీ అధికారులు

గణపవరం: గణపవరంలో శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో ఒక వ్యక్తి నుంచి రూ.1,38,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు గుర్తించడంతో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

రూ.79 వేలు పట్టివేత

కామవరపుకోట: కామవరపుకోట చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో రూ.79 వేల నగదు దొరికిందని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జె.వి.ఆర్.రమేష్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో 102 తనిఖీ చేశామని, ఈ చెక్‌పోస్ట్‌లో ఇంతవరకు రూ.9 లక్షలు స్వాధీన చేసుకున్నామన్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు



వేలేరు శివారు అటవీ ప్రాంతంలో బెల్లపు ఊటను ధ్వంసం చేసిన దృశ్యం

కుక్కునూరు: నాటు సారా బట్టీలపై కుక్కునూరు పోలీసులు దాడులు నిర్వహించారు. వేలేరు గ్రామ శివారు అటవీ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఈ దాడుల్లో 70 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 5 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నమాజులో ఆరోగ్య సూత్రాలు

చింతలపూడి : ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఆచరించే నమాజులో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య సూత్రాలు దాగిఉన్నాయి. ముఖ్యంగా రంజాన్ మాసంలో కఠోర ఉపవాసం ఉండే ముస్లింలు ఎక్కువ పర్యాయాలు నమాజ్ చేస్తారు. ఇలా నమాజ్ చేయడం వల్ల భగవంతుడి కృపతో పాటు వ్యాయామం వల్ల ఆరోగ్య పరంగా ఎన్నో మంచిదని ముస్లిం పెద్దలు సూచిస్తున్నారు. నమాజులోని ప్రతి క్రియలోనూ వ్యాయామ గుణాలు అధికంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు అవకాశాలు ఎక్కువని చెబుతున్నారు. వేకువ జామునే నిద్ర లేచి నమాజు ప్రక్రియను ప్రారంభిస్తారు. నమాజులో తక్బీర్, ఖియామ్, రుకూ, సజ్దా, సలాం, వంటి ప్రక్రియలను వివిధ భంగిమలతో ఆచరిస్తారు. దీంతో మానవుని అన్ని అవయవాలకు వ్యాయామం జరిగి రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది.



దుఆ

నమాజు అనంతరం అల్లాహ్‌ను దుఆ (ప్రార్థన) చేయడంతో నమాజు ముగుస్తుంది. నమాజ్‌ను క్రమం తప్పకుండా చేయడం వల్ల ఆధ్యాత్మిక చింతన పెరగడంతో పాటు శరీర బరువు తగ్గడం, పలు రుగ్మతలు తగ్గుతాయి.

సలాం

నమాజు పూర్తయ్యే సమయంలో తలను ఒకసారి కుడి వైపుకు తిప్పి అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహ్ అని మరోసారి ఎడమ వైపునకు తిప్పి అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహ్ అని చెప్పి నమాజును ముగిస్తారు. దీనివల్ల గొంతుకు, మెడకు మంచి వ్యాయామం లభిస్తుంది. మెదడు ఉత్తేజమవడంతో పాటు కంటిచూపు బలపడుతుంది.

రుకూ



రెండు చేతులు మోకాళ్ళపై ఉంచి నడుమును సమాంతరంగా ఉంచాలి. చూపును రెండు కాళ్ళ బొటన వేళ్లపై కేంద్రీకరించాలి. ఈ క్రియ ఉదర భాగానికి, వెన్నెముకకు ఉత్తమ వ్యాయామాన్ని ఇస్తుంది.

ఖియాం



రెండు చేతులను బొడ్డు మీదికి వచ్చేటట్టు కట్టుకోవాలి. ఇది నమాజులో విధిగా ఆచరించే భంగిమ. దీనివల్ల ఏకాగ్రత లభిస్తుంది. నిటారుగా నిలబడటం వల్ల శరీర భాగాల్లో రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది.

తక్బీర్



నమాజ్ చేయడానికి ముందు (నియ్యత్ చేసి) అల్లాహు అక్బర్ అంటూ తన రెండు చేతులను చెవుల వరకు పైకెత్తి కిందికి దించి నాభి పైన రెండు చేతులను కట్టుకోవాలి. ఈ ప్రక్రియ వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంది. నిష్కల్మష చిత్తంతో మనసును దేవునిపై లగ్నం చేసి ఆరాధించే అవకాశం లభిస్తుంది.

సజ్దా



పాదాలు, అరచేతులు, మోకాళ్ళు, ముక్కు, నుదురు వీటిని నేలను తాకేలా ఉంచి దైవానికి సాష్టాంగ ప్రమాణం చేయాలి. ఈ భంగిమ ద్వార శరీర అవయవాలన్నింటికీ మంచి వ్యాయామం లభిస్తుంది. ముఖ్యంగా ఛాతీకి, భుజాలకు మంచి వ్యాయామం.

జల్సా



సజ్దా అనంతరం రెండు మోకాళ్ళను మడిచి మోకాళ్ళపై చేతులు ఉంచి కూర్చుంటారు. ఈ క్రియ వజ్రాసనాన్ని పోలి ఉంటుంది. శరీరంలోని 72 వేల నాడులపై ఇది ప్రభావం చూపుతుంది. జీర్ణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత పెరుగుతుంది.

వలంటీర్ల రాజీనామాలు

ఆకివీడు: వలంటీర్లుగా సేవలందించి ప్రజలు మన్ననలు పొందిన మేమంతా ప్రతిపక్ష పార్టీలు ఈర్ష్య, ద్వేషాలకు బలై రాజీనామాలు చేస్తున్నామని స్థానిక సచివాలయం–3కు చెందిన 19 మంది వలంటీర్లు చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం రాజీనామా పత్రాల్ని ఎంపీడీఓకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవాభావాన్ని తమకు అలవర్చిన జగనన్నకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.



పెనుమంట్ర మండలం వెలగలవారిపాలెంలో రాజీనామా చేసిన వలంటీర్లు



ఆకివీడు సచివాలయం-3లో రాజీనామా పత్రాల్ని ఎంపీడీఓ రామకృష్ణకు అందజేస్తున్న వలంటీర్లు

కలిదిండి మండలంలో..

కలిదిండి : వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ గ్రామ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. కలిదిండి మండలం చినతాడినాడ గ్రామ సచివాలయానికి చెందిన 13 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలు చూపుతూ శుక్రవారం రాజీనామాలు చేశారు. ఐదు సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవ్వా తాతలకు పింఛన్లు పంపిణీ చేసిన వలంటీర్లపై నిబంధనలు పెడుతూ ఆదేశాలు ఇవ్వడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికల్లో తాము ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

పెనుమంట్ర మండలంలో..

పెనుమంట్ర: మండలంలో వలంటీర్ల రాజీనామాలు శుక్రవారం కూడా కొనసాగాయి. పెనుమంట్ర మండలంలో 12 గ్రామ పంచాయతీలకు చెందిన 206 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి, రాజీనామా పత్రాలు సమర్పించారని ఎంపీడీవో పద్మజ తెలిపారు. ఎస్.ఇల్లిందలపర్రులో 11 మంది, పాలమూరులో 30, ఆలమూరులో 18, ఓడూరులో 7, పెనుమంట్రలో 29, మాముడూరులో 12, నెగ్గిపూడిలో 19, మార్టేరులో 33, వెలగలవారిపాలెంలో 9 మంది వలంటీర్లు తమ రాజీనామాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.

అత్తిలి మండలంలో..

అత్తిలి : మండలంలో వలంటీర్ల రాజీనామా కొనసాగుతోంది. శుక్రవారం పాలూరు, లక్ష్మీనారాయణపురం, స్కిన్నెరపురం, వరిఘేడు గ్రామాలలో వలంటీర్‌లు రాజీనామా చేసి, రాజీనామా పత్రాలను గ్రామ పంచాయితీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ సేవ చేస్తున్న వలంటీర్‌ల ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారం తట్టుకోలేక రాజీనామా చేశామన్నారు.



కలిదిండి మండలం చినతాడినాడలో రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న గ్రామ వాలంటీర్లు



అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురంలో రాజీనామా చేసిన వలంటీర్లు

అగ్రికల్చర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీని అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం ఏలూరు అగ్రికల్చర్ జేడీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వీఎస్ఆర్ గంగాధర్, కార్యదర్శిగా ఎండీ రఫీ, కోశాధికారిగా బి.రాకేష్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మినిస్ట్రీయల్ సిబ్బంది రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, రాష్ట్ర సెక్రటరీ ప్రసాద్, ఎన్నికల అధికారులుగా డీఎస్ఎన్ శ్రీనివాస్, సాయి కుమార్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గంలో ఎన్నికైన సభ్యులకు జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అభినందనలు తెలిపారు. నూతన కమిటీ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని, వారి శ్రేయస్సు కోసం పాటుపడతానని తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్జీవో అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి నేరుసు రామారావు అభినందనలు తెలిపారు.

విద్యుత్ లైన్‌మేన్ సస్పెన్షన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడులో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో ఎనర్జీ అసిస్టెంట్ గాయపడిన ఘటనలో సీనియర్ లైన్‌మేన్‌ను సస్పెండ్ చేస్తూ ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మార్చి 12న స్థానిక సత్రంపాడు పరిధిలో ఒక ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫిర్యాదుపై విద్యుత్ సరఫరాను పునరుద్ధరణకు విద్యుత్ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్ళారు. ఈ సందర్భంగా స్థానిక లైన్‌మెన్ కొత్తపల్లి రామకృష్ణ, విద్యుత్ స్తంభం ఎక్కి సమస్య పరిష్కరించాల్సి ఉండగా ఆ పరిధిలో పని చేసే ఎనర్జీ అసిస్టెంట్ అర్జా వినోద్ బాబును స్తంభం ఎక్కించి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేయించారు. సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫరా చేశారు. దీంతో స్తంభంపై పని చేస్తున్న వినోద్‌బాబు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. ఘటనకు సంబంధించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రామకృష్ణను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నటరాజన్ తెలిపారు. ఈ ఘటనలో మహిళా అధికారిపై విచారణ చేస్తున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆగడాలలంకకు చెందిన భలే ఆనందరావు (48) ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఆనందరావు ఆగడాలలంకలో గత నెల 15న మోటార్ బైక్‌పై వెళ్తుండగా అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలైన ఆనందరావును విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన మృతిపై కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలి



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలో వెట్టి చాకిరి నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, కార్మిక శాఖలు, సీడబ్ల్యూసీ, ప్యానల్ లాయర్లతో కలిసి దిశా పోలీస్ స్టేషన్ నుంచి అవగాహన ర్యాలీని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ప్రారంభించారు. ఏలూరు పట్టణంలోని దుకాణాల్లో పని చేస్తున్న కార్మికుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ వెట్టి చాకిరి, బాలకార్మిక వ్యవస్థ కొనసాగుతుందన్నారు. దీని నిర్మూలనకు అన్ని వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయసహాయాన్ని అందిస్తుందన్నారు. డీసీపీఓ సూర్యచక్రవేణి మాట్లాడుతూ సమాజంలో ప్రతి పౌరుడికి ఈ వెట్టి చాకిరి, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించాల్సిన బాధ్యత ఉందన్నారు. 1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాధితులకు రక్షణ, పునరావాసం ఏర్పాటు చేయడమేకాకుండా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దిశ సీఐ విశ్వం, అసిస్టెంట్ లేబర్ అధికారి గోపాల కృష్ణారావు, ప్యానల్ లాయర్ కూన వెంకట కృష్ణారావు, జీవీ భాస్కరరావు, దిశ ఎస్ఐ కాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం శశిలో 7న అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని శశి క్యాంపస్‌లో ఏప్రిల్ 7వ తేదీన ఆదివారం 6వ తరగతి నుంచి 10+1 విద్యార్థుల కోసం ఐఐటీ జేఈఈ, నిట్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. క్యాంపస్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన హాస్టల్ క్యాంపస్ ప్రారంభిస్తున్నామని విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మేకా క్రాంతి సుధలు వివరించారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

భీమవరం: విశాఖ డెయిరీ సొమ్మును సొంతానికి వాడుకున్న వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం చెప్పారు. నరసయ్య అగ్రహారం ప్రాంతానికి చెందిన కర్రి మాధవ్ విశాఖ డెయిరీ సంస్థలో డబ్బులు కలెక్షన్ చేస్తుంటాడు. ఆ సొమ్ములో సుమారు రూ.42.76 లక్షల మొత్తాన్ని వాడుకోవడంతో సంస్థ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తీవ్ర ఉష్ణోగ్రతలో ధాన్యం ఆరబెట్టొద్దు

- మిల్లింగ్‌లో బియ్యం నూకగా మారే ప్రమాదం
- పైరు కర్ర పచ్చిగా ఉండే సమయంలోనే కోత ఉత్తమం
- దాళ్వా ధాన్యం ఆరబెట్టడంపై జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వ్యవసాయ నిపుణులు



పాడి-పంట

భీమవరం: జిల్లాలో దాళ్వా మాసూళ్లు ప్రారంభమయ్యాయి. పైరు ఆశాజనకంగా పెరగడంతోపాటు పెద్దగా చీడ, పీడలు, ఎలుకల బెడద లేకపోవడంతో మంచి దిగుబడి వస్తోంది. ఇప్పటికే తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, తణుకు తదితర మండలాల్లో మాసూళ్లు ప్రారంభయ్యాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో వరికోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్న రైతులు కళ్లాలు, రోడ్లు వెంబడి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. అయితే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ధాన్యం అధికంగా ఎండితే బియ్యం ముక్కలయ్యే ప్రమాదం ఉంది. దీని వల్ల రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోడానికి నిరాకరించే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 2.20 లక్షల ఎకరాల్లో దాళ్వా వరిసాగు చేయగా ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 1121 రకాన్ని సాగుచేశారు. మరికొంతమంది పీఆర్ 126, ఎంటీయూ 1153, 1156 రకాలను పండించారు. ప్రస్తుతం మాసూళ్లు చేస్తున్న ప్రాంతాల్లో ఎకరాలకు 65 బస్తాల వరకు దిగుబడి వస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా 9.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా.

ధాన్యం ఎండబెట్టడంతో ఈ జాగ్రత్తలు తీసుకుందాం..

దాళ్వా సీజన్‌లో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్య మిల్లింగ్‌లో గింజ విరిగిపోయి నూక ఎక్కువగా రావడం వల్ల ధరపై ప్రభావం చూపుతోంది. అందువల్ల కోత కోసే సమయంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వరికంకుల్లో 90 శాతం గింజలు పసుపురంగుకు మారుతున్నప్పుడు కర్ర పచ్చిగా ఉండగానే పంటను కోయాలి. గింజల్లో తేమ తగ్గించడానికి 5 రోజుల వరకు పనలను చేనుపైనే ఎండనివ్వాలి. పంటను ముందుగా కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉండడంతో కంకిలోని చివరి గింజలు పూర్తిగా నిండుకోక మిల్లింగ్ చేసినపుడు అధికంగా నూక అయ్యే అవకాశముంది. పంటను సకాలంలో కోత కోయలేకపోతే గింజలు వరి యంత్రాలతో మాసూళ్లు చేస్తే చెత్త, దుమ్ము, మట్టిబెడ్డలు వంటివి ధాన్యంలో తగ్గుతాయి. ధాన్యంలో తేమ క్రమక్రమంగా తగ్గాలి. దీనికోసం సాధారణమైన ఎండలో ధాన్యాన్ని పరచి మధ్యమధ్యలో తిరగదిప్పాలి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నపుడు ఆరబెడితే గింజలలో తేమ ఒక్కసారిగా తగ్గి గింజలపై పగుళ్లు వస్తాయి.

బియ్యంలో నూక ఎక్కువగా రావడానికి ప్రధాన కారణాలు ఇవే..

పంట పక్వానికి వచ్చినా చేనుపైనే ఎండిపోవాలనే ఉద్దేశంతో కోతను ఆలస్యం చేయడం, కోత కోయడానికి చేను క్రమక్రమంగా కాకుండా ఒకేసారి నీటిని తగ్గించివేయడం. కీలక దశలలో పంట నీటి ఎద్దడికి గురికావడం వల్ల కింద గింజలు పూర్తిగా తోడుకోక నూక ఎక్కువగా వస్తుంది. అధిక ఉష్ణోగ్రతల వద్ద ధాన్యాన్ని కల్లంలో ఆరబెట్టడం వల్ల గింజలలో తేమ ఒకేసారి తగ్గి నూక శాతం ఎక్కువ వస్తుంది.



ధాన్యాన్ని ఆరబెట్టడంలో శ్రద్ధ తీసుకోవాలి



దాళ్వా మాసూళ్ల సమయంలో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల ధాన్యం ఎక్కువగా ఎండితే బియ్యంలో నూకశాతం అధికంగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ ఉష్ణోగ్రతలో ధాన్యాన్ని ఎక్కువ రోజులు ఎండబెట్టకుండా తక్కువ ఎండ తగిలేచోట ఎండబెట్టుకోవాలి. అంతేగాకుండా కోత కోసే సమయంలో కూడా పైరు కర్రపచ్చిగా ఉండగానే మాసూళ్లు చేసుకోవడం మేలు. యంత్రాలతో కోసిన ధాన్యాన్ని తగినంత ఎండలో ఆరబెట్టుకునేలా చర్యలు తీసుకోవాలి.

– ఎంవీ కృష్ణాజీ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు

17 శాతం తేమతో ధాన్యం కొనుగోలు



జిల్లాలో రబీ వరి దిగుబడి ఆశాజనకంగా ఉంది. 2.20 లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా దాదాపు 9.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. దాళ్వా పంటలో ధాన్యం ఎక్కువగా ఎండడం వల్ల బియ్యంలో నూకశాతం పెరుగుతుంది. 17 శాతం తేమతో ధాన్యం కొనుగోలు చేస్తున్నందున దానికి అనుగుణంగానే ఎండబెట్టాలి. ధాన్యాన్ని ఎక్కువ ఎండలో కాకుండా కొద్దిపాటి ఎండతగిలే విధంగా ఆరబెట్టుకోవడం మేలు.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం